క్లుప్తంగా

అంబరాన్నంటిన వారాల పండుగ


ఉండ్రాజవరంలో గ్రామదేవతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఉండ్రాజవరం గ్రామదేవత దయవల్ల ఉండ్రాజవరం, పోతునూరుతో పాటు నియోజకర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేలా అమ్మవారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. సోమవారం ఉండ్రాజవరంలో సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్, గ్రామస్తుల ఆధ్వర్యంలో వారాల పండుగ అంబరాన్నంటేలా ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి ఉండ్రాజవరం గ్రామస్తులు మేళతాళాలతో గ్రామంలోకి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ దేవతకు ప్రజాప్రతినిధులు పూజలు నిర్వహించారు.

వృద్ధుల రక్షణకు ప్రత్యేక చట్టాలు



సీనియర్ సిటిజన్ పుప్పాల మెహర్‌ను సన్మానిస్తున్న మానవత సభ్యులు

నిడమర్రు(గణపవరం): వృద్ధుల పట్ల నిరాదరణ తగదని, వృద్ధుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను రూపొందించాయని మానవత జిల్లా మాజీ అధ్యక్షుడు సాగిరాజు జానకిరామరాజు అన్నారు. సోమవారం నిడమర్రు మండల మానవత సమావేశం సిద్దాపురంలో మండల వైఎస్సార్ గృహసారథుల కన్వీనర్ నౌడు అచ్యుత రామారావు ఇంటి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్‌ను ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. పలువురు ఆయనను పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు సంకు శ్రీను, ముత్యాల చినసత్యనారాయణ, పవన్ సాయి, సీహెచ్ అప్పారావు, కూర్మాల నాగు పాల్గొన్నారు.

జగనన్న భూ సర్వేకు సరిహద్దు రాళ్లు సిద్ధం


గణపవరం పంచాయతీ వద్ద భూ సర్వే సరిహద్దు రాళ్లు దిగుమతి చేస్తున్న దృశ్యం

గణపవరం: గణపవరం మండలంలో జగనన్న భూసర్వే పూర్తయిన ప్రాంతాల్లో హద్దుల్లో వేయడానికి అవసరమైన భూ సర్వే రాళ్లు గణపవరం గ్రామ పంచాయతీ వద్దకు చేరాయి. సోమవారం వాటిని లారీల్లోంచి కూలీలు దిగుమతి చేసి పంచాయతీ ఆవరణలో ఒకచోట వేస్తున్నారు. వీటిని త్వరలో ఉచితంగా రైతులకు అందజేయనున్నారు. రైతులు వాటిని తమ భూముల వద్దకు తీసుకువెళ్లి హద్దుల వద్ద ఉంచుకోవాలని అధికారులు సూచించారు. సిబ్బంది సరిహదులు నిర్ణయించి వాటి వద్ద రాళ్లను ఏర్పాటు చేస్తారని తహసీల్దార్ పమ్మి లక్ష్మి తెలిపారు. ముందుగా గణపవరం గ్రామంలోని సర్వే పూర్తయిన ప్రాంతాలలో ఈ సరిహద్దు రాళ్లు వేస్తామన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తున్న 15 మంది అరెస్టు

పెదపాడు: స్థానిక కలపర్రు శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ సోమవారం తెలిపారు. వీరి వద్ద నుంచి 15 మోటారు సైకిళ్లు, రూ.5,600 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఆదివారం సాయంత్రం వచ్చిన సమాచారం మేరకు ఈ దాడి నిర్వహించినట్టు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయికి చేరాలి

ఏలూరు రూరల్ : ప్రభుత్వం నుంచి రైతులకు అందించే ప్రతి పథకాన్నీ క్షేత్రస్థాయికి చేరేలా రైతు భరోసా కేంద్ర సిబ్బంది కృషి చేయాలని డీఎస్‌ఓ గాంధీ అన్నారు. సోమవారం ఏలూరులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందితో అధికారులు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏలూరు మండల గ్రామాల్లో 2,216 మంది రైతులకు కౌలుదారు కార్డులు మంజూరు చేసిందని గాంధీ వివరించారు. ఇందులో ఇప్పటికే 820 మందికి పలు బ్యాంకులు సుమారు రూ.2.50 కోట్లు రుణాలు అందించాయన్నారు. తహసీల్దార్ బి.సోమశేఖర్ మాట్లాడుతూ మిగిలిన రైతులకు సైతం రుణాలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇందుకోసం బ్యాంక్ మేనేజర్లతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకూ సీసీఆర్సీ కార్డులు మంజూరు చేశామని మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య తెలిపారు.

క్రీడాపోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు


పెదవేగి: కొప్పాకలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు


పెదవేగి: వేగివాడలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సర్పంచ్, ఉపాధ్యాయులు

- జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక
- విజేతలను అభినందించిన ఉపాధ్యాయులు


పెదవేగి: ముందూరులో ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులతో పీడీ, ప్రధానోపాధ్యాయురాలు


పెదపాడు: వట్లూరులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

పెదవేగి : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు క్రీడాపోటీల్లో సత్తాచాటి అభినందనలు అందుకుంటున్నారు. వేగివాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లాస్థాయికి ఆటల పోటీలకు ఎంపికవడం అభినందనీయమని సర్పంచ్ ప్రభావతి చెప్పారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అండర్-14 కబడ్డీ విభాగంలో సీహెచ్ దుర్గప్రసన్న, ఖోఖో బి అమ్ము, జావెలిన్ త్రో, షాట్‌పుట్ బ్యాడ్మింటన్‌లో ఎం లక్ష్మీప్రసన్న, ఖోఖోలో డీ పవన్‌కుమార్, అండర్-14 లాంగ్ జంప్‌లో సీహెచ్ దివ్య, ఖోఖో, టెన్నికాయిట్‌లో ఎం రమ్య, ఖోఖో, బ్యాట్మింటన్‌లో బీ సత్యవరప్రసాద్, హైజంప్‌లో సీహెచ్ గీతాంజలి, డిస్కస్‌త్రో బీ బ్లెస్సీ, టెన్నీకాయిట్‌లో కె రోజా ఎంపికైయ్యారు. వీరిని సర్పంచ్ ప్రభావతి సత్కరించారు.

ముందూరులో...

ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించిన దెందులూరు నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్‌లో పెదవేగి మండలం ముందూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని హెచ్‌ఎం ఉషారాణి అన్నారు. ఖోఖోలో శ్రీవల్లి, చందన, స్రవంతి, గీతిక, కబడ్డీలో షణ్ముఖ్, దుర్గాపవన్, వాలీబాల్‌లో రాజేష్, లాంగ్ జంప్‌లో చందన, జావెలిన్ త్రోలో ఎస్తేరు రాణి, గీతిక, రన్నింగ్ 100 మీటర్లలో సింధూర ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం తెలియజేశారు. సోమవారం పాఠశాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు బల్లా విజయరాజ్ ఇతర సిబ్బంది, సర్పంచ్, గ్రామ పెద్దలు, విద్యా కమిటీ చైర్మన్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

కొప్పాకలో...

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో కొప్పాక విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం ఆర్ శైలజ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్-17 విభాగానికి వాలీబాల్‌లో ఇద్దరు, అండర్ 14 వాలీబాల్‌లో ఇద్దరు విద్యార్థులు, అండర్-17 త్రోబాల్‌లో ఆరుగురు బాలురు, ఐదుగురు బాలికలు, అండర్-14 త్రోబాల్‌లో ఐదుగురు బాలికలు, ఐదుగురు బాలురు, అండర్-14 కబడ్డీ విభాగానికి ఒకరు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. ఈ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన పీడీ మోర్ల శ్రీనివాస్‌ను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

క్రీడల్లో రాణించిన వట్లూరు హైస్కూలు విద్యార్థులు

పెదపాడు: ఈ నెల 23న దెందులూరు మండలం వట్లూరులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆటల పోటీల్లో వట్లూరు హైస్కూలు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వీరిలో పలువురు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో వాలీబాల్ అండర్-17 కు కొత్తపల్లి సురేంద్ర, అండర్ -14 కబడ్డీ పోటీలకు షేక్ ఆరిఫ్ అహ్మద్, అథ్లెటిక్స్‌లో ఎస్ అభిషేక్, పిల్లా స్వీటి, కట్టా కీర్తన, పందుల ప్రజ్వల్, పిల్లా సుష్మంత్, ఎస్ వల్లీ సాగర్ ఎంపికయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ళసతీష్ చౌదరి, సర్పంచ్ గుజ్జుల నవీన్ రత్నకుమారి, హెచ్‌ఎం ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

హైవేపై ఆహ్లాదాన్ని పంచుతున్న పూల మొక్కలు


జాతీయ రహదారి డివైడర్ మధ్యలో పెరిగిన పూలమొక్కలు

ఉంగుటూరు: జాతీయ రహదారి డివైడర్ మధ్యలో పెరిగిన పూల మొక్కలు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. జాతీయ రహదారి మధ్యలో గుండుగొలను నుంచి సిద్ధాంతం వరకు వివిధ రకాల పూలమొక్కలను పెంచారు. ఆ మొక్కలను రోజూ నీరు పోసి సంరక్షించడంతో ఏపుగా పెరిగి వివిధ రకాల పూలు పూస్తూ పచ్చదనంతో అందంగా వాహనదారులకు కనువిందు చేస్తున్నాయి. చూడముచ్చటగా కనిపిస్తున్న పూలను కొంతమంది వాహనదారులు ఆగి కోసుకుని వెళుతున్నారు. హైవే విస్తరణాధికారులు పర్యవేక్షణలో ఉంగుటూరు టోల్‌ప్లాజా యాజమాన్యం ఈ మొక్కలను సంరక్షిస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు

పెదవేగి : ఆయిల్‌పామ్ తోటల్లో గెలలను దించేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని పెదవేగి ఎలక్ట్రికల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పెదవేగి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎలక్ట్రికల్ సిబ్బంది, రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలల కోత సమయంలో తరచూ విద్యుత్ ప్రమాదాలు నమోదవుతున్నాయని, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ నాగ శేషుడు, పామాయిల్ ఫ్యాక్టరీ డిప్యూటీ మేనేజర్ ఎస్ శ్రీనివాస్, రైతులు కే వెంకటేశ్వరరావు, జె వెంకట సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

జోగన్నపాలెం సొసైటీ.. ప్రగతిలో మేటి


రైతుకు చెక్కును అందజేస్తున్న సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు తదితరులు

దెందులూరు: జోగన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీలో జిల్లాలోనే ఆదర్శవంతమైన సొసైటీగా ప్రగతి సాధిస్తోందని చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి సహకారంతో రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చైర్మన్ అన్నారు. సోమవారం జోగన్నపాలెం సొసైటీ కార్యాలయ ఆవరణలో కార్యదర్శి కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నూరు శాతం వడ్డీ రాయితీని, చెక్కులను రైతులకు చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, డైరెక్టర్ మేడికొండ వెంకటేశ్వరరావు, కార్యదర్శి కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు నిట్టా గాంధీ, తేరం ప్రసాదరావు రైతులకు చెక్కులు అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జోగన్నపాలెం సొసైటీ రూ.3.60 కోట్ల పంట రుణాలు, ఎల్‌టీ రుణాలు రైతులకు అందించామన్నారు. డిపాజిట్ల రూపంలో రూ.3.19 కోట్లు బ్యాంకులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తేరం రామకృష్ణ, బుజ్జి, పీ.బాబ్జి, తదితరులున్నారు.

ఎలుకల నిర్మూలనతో పంటలకు మేలు


ఉంగుటూరులో సామూహిక ఎలుకలు నిర్మూలనకు సిద్ధం చేసిన మందు

పెదపాడు: మండల వ్యాప్తంగా ఈనెల 26, 27 తేదీల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 26న ఎలుక బొరియలు గుర్తించి, 27న మందు కలిపి ఎలుక బొరియల్లో ఉంచాలన్నారు. రైతులందరూ రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమానికి హాజరై సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రదీప్ కుమార్ కోరారు.

ఉంగుటూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో..

ఉంగుటూరు: ఈ నెల 26, 27 తేదీల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి బి.వెంకటేష్ వెల్లడించారు. 26న రైతులతో పొలం గట్లపై, పోరంబోకు స్థలాల్లో బొరియలు గుర్తించి, వాటిని మట్టితో పూడ్చివేసి, 27న తెరుచున్న బొరియల్లో బ్రోమోడయోలిన్ మందును కలిపిన నూకల పొట్లాలను వేస్తామని తెలిపారు. ఈ సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం మండలంలోని ఆర్‌బీకేల వద్ద నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని మందును తీసుకుని ఎలుకల నిర్మూలన చేపట్టాలన్నారు. మండలానికి 110కేజీల బ్రోమోడయోలిన్ మందును 100 శాతం రాయితీపై అందిస్తామన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం


కాగుపాడు హైస్కూల్లో విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ ఏటా గ్రామంలోని విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం అభినందనీయమని కాగిపాడు సర్పంచ్ కడియాల సుదీష్ణ అన్నారు. సోమవారం కాగుపాడు హైస్కూల్లో పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ వారు హైస్కూల్లోని విద్యార్థులకు, మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి హెచ్‌ఎం ఎం.ఉమాదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, నిరంతర కృషి ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ట్రస్ట్ సేవలను ఎంఈవో-2 శ్రీనివాసరావు కొనియాడారు. పత్తి వీరాస్వామి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త సతీష్‌ధావన్ జయంతిని పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.కామేశ్వరరావు ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠవాల ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ఆర్థిక సహకారం అందజేశారు. జెడ్పీ హైస్కూల్‌కు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస, కడియాల జానకిరామ్, ఎం.రవిశంకర్, సత్యనారాయణ, సూర్యప్రకాశరావు, అనితారాణి, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఏలూరు రూరల్ : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పెదపాడు ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి, భార్య శేషారత్నంను సోమవారం శనివారపుపేట ఉర్దూ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం రహీదా అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ ఎ.రవిప్రకాష్, ఆర్ రంగయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడంలో భార్యభర్తలు ఇద్దరూ పోటీపడ్డారని కొనియాడారు. రంగయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, బాలబాలికలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ ఇద్దరూ జిల్లా స్థాయిలో అవార్డులు అందుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, అవార్డులు, సన్మానాలు మరింత బాధ్యతను పెంచుతాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కాలీష, కాంప్లెక్స్ చైర్మన్ జి.ప్రకాష్, కార్యదర్శి నాగేంద్రసింగ్, బాబుషరీఫ్, ఉపాధ్యాయులు షకీలా, పద్మావతి, సునీత, అనిధ, పేరెంట్స్ కమిటీ సభ్యులు సన్మాన గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా వినాయక విగ్రహాల ఊరేగింపు


భీమడోలు: శ్రీమన్మహా గణనాథుడు


దెందులూరు : కొవ్వలి రాజుల పేటలో గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న యువత, చిన్నారులు


గణపవరం: వినాయక ఉత్సవాల వద్ద కోలాట ప్రదర్శన చేస్తున్న యువతీ యువకులు


భీమడోలు: కూచిపూడి నృత్య ప్రదర్శన


భీమడోలు: ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గణపవరం: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వినాయకుని చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. గణపవరంలో మారెమ్మగుడి సెంటర్, వెలంపేట, బస్టాండు, తోట, మసీదు వీధి తదితర ప్రాంతాల్లో వినాయకచవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బువ్వనపల్లిలో వెలంపేటలో యువతీ యువకులు నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

భీమడోలు: భీమడోలులోని శ్రీమన్మహా గణపతి స్వామి 59వ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేసారు. శ్రీమన్మహా స్వామిని సోమవారం భక్తులు దర్శించుకుని ప్రత్యేకపూజలు చేసారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన సోమవారం స్వామి వారు తెలుపు వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఆలయంలో ప్రాంగణం వద్ద తాడేపల్లిగూడెం నటరాజ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

కొవ్వలిలో గణనాథుడికి పూజలు, నిమజ్జనం

దెందులూరు: మండలంలో గ్రామగ్రామాన వినాయక చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు.ఆలయాల్లో, కూడళ్లల్లో ఏర్పాటుచేసిన వినాయకుడికి పూజలు నిర్వహించి అనంతరం విగ్రహాలను ఊరేగించి నిమజ్జనాలు చేస్తున్నారు. కొవ్వలి రాజులపేటలో చెరువు గట్టున విద్యాగణపతి యూత్ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గ్రామంలో ఊరేగించి గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు.

కేథలిక్ కళాశాల విద్యార్థులకు పథకాలు వర్తింపజేయాలి


ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: కన్సార్టియం ఆఫ్ క్యాథలిక్ కళాశాలల్లో నమోదైన విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన అందించాలని, దీనికి అడ్డంకిగా ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. సోమవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ కన్సార్టియం ఆఫ్ క్యాథలిక్ కళాశాలల్లోని అనేక మంది జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనకు నోచుకోలేదన్నారు. ప్రతి మండలంలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు పనులను మరింత వేగవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సేవకుడిగా, బడి పిల్లలకు మేనమామగా, పేద కుటుంబాలకు అండగా ఉన్నారన్నారు. చదువు ఒక కుటుంబ చరిత్రనే కాదు, ఆ కుటుంబానికి చెందిన సామాజిక, ఆర్థిక ప్రపంచాన్నే మార్చేస్తుందని అన్నారు. చదువుల వల్ల ఆర్థిక, సామాజిక రంగాల్లో వినూత్న మార్పులు రావాలని కోరుకుంటూ సీఎం జగన్ నాణ్యమైన చదువుల కోసం విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా నాడు-నేడు, మన బడి పథకాన్ని ఏర్పాటు చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సకల సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని అన్నారు. పిల్లలకు నాణ్యమైన భోజనం, ప్రణాళికా బద్ధంగా మౌలిక వసతుల కల్పన, నోటు పుస్తకాల నుంచి విదేశీ విద్య వరకు ప్రతి అడుగులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు తోడుగా నిలిచారని కొనియాడారు.

శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయము
అంబర్‌పేట (గ్రా), భీమడోలు (మం), ఏలూరు జిల్లా.
e-Procurement Tender
NIT No.P1/COE/523/2023-3,Dt:19.08.2023
దేవాలయ అభివృద్ధి పనుల కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు
ఇట్లు,
ఎమ్.రాధ, కార్యనిర్వహణాధికారి,
సెల్ : 9948217594

